- నాడు నిండుకుండలా మల్లన్నసాగర్

సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ నిరుడు ఇదే సమయంలో నిండుకుండలా ఉంది. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్‌ను గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లతో నింపింది. మల్లన్నసాగర్ నుంచి వందలాది చెరువులు, చెక్‌డ్యామ్‌లు, హల్దీ, కూడవెల్లి వాగులకు జలాలను విడుదల చేసి పంటల సాగుకు దోహదపడింది.

- నేడు డెడ్‌స్టోరేజీకి..

కాంగ్రెస్ పాలనలో మల్లన్నసాగర్ డెడ్‌స్టోరేజీకి చేరింది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు లేకపోవడంతో మల్లన్నసాగర్‌ను ఎండబెట్టింది. వేలాది ఎకరాల ఆయకట్టుకు భరోసా లేకుండా చేసింది. దీంతో రైతులు సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రహదారుల దిగ్బంధం

మొదటిపేజీ తరువాయి...

ప్రతి రైతుకు అందేలా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. హల్దీ వాగులోకి కాళేశ్వరం జలాలను వదిలితే వంద కిలోమీటర్లు ప్రవహించి నిజాంసాగర్ వరకు చేరుతాయని, కూడవెల్లి వాగులోకి కూడా సాగు నీళ్లను వదిలితే అప్పర్‌మానేరు వరకు వంద కిలోమీటర్లు ప్రవహించడంతోపాటు సుమారుగా 40 చెక్‌డ్యాంలు నిండుతాయని, లక్ష ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రెండు ప్రాజెక్టుల నుంచి సాగునీళ్లను వదలడంతో పాటు రామాయంపేట, సంగారెడ్డి, తుర్కపల్లి, జగదేవ్‌పూర్ కాలువలు, చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్‌కు ఒక్క ఫోన్ చేస్తే నీళ్లను వదిలేవారని, లక్షలాది ఎకరాల్లో పంటలు పండి రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకియొద్దీన్ తదితరులు తదితరులున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు.. రైతుల్లో అందోళన

సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయకపోవడం, వానలు సక్రమంగా పడకపోవడంతో జిల్లాలో వరినాట్లు 50% కూడా పూర్తి కాలేదు. చెరువులు, కుంటలు బోసిపోయి కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు డెడ్‌స్టోరేజీలో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వహయంలో సకాలంలో రిజర్వాయర్లు నింపి వాటి ద్వారా చెరువులకు నీటిని విడుదల చేయడంతో నిండుకుండలా చెరువులు ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం రిజర్వాయర్లలోకి నీటిని విడుదల చేయకపోవడంతో అవి డెడ్‌స్టోరేజీకి చేరాయి. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోర్ బావుల్లో నీటి నిల్వలు పడిపోయాయి. రైతులు సాగు చేద్దామంటే నీరు లేదు. వరి నారు ముదిరిపోతున్నది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో రిజర్వాయర్లలోకి నీటిని విడుదల చేయాలన్న డిమాండ్‌తో రైతులు హైదరాబాద్– కరీంనగర్ రాజీవ్ రహదారిని దిగ్బంధం చేయడానికి సిద్ధమవుతున్నారు.

రిజర్వాయర్లు ప్రస్తుత నీటి మట్టాలు (టీఎంసీల్లో..)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
రంగనాయకసాగర్	3	0.69
మల్లన్నసాగర్	50	8.849
కొండపోచమ్మ	15	4.75

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కూడవెల్లిలో సాగునీళ్లు వదలాలి

ఈ ఏడాది వర్షాలు సరిగ్గా కురవలేదు. బోర్లు తక్కువగా నీళ్లు పోస్తున్నాయి. దీంతో చాలామంది రైతులు వరినాట్లు వేయలేకపోయారు. ఇప్పటికైనా మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా కొండపోచమ్మ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నుంచి కొడకండ్ల వద్ద కూడవెళ్లిలోకి ప్రభుత్వం నీటిని వదలాలి. ఇలా చేస్తే చెక్‌డ్యాంలు నిండి, రైతులకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం కాళేశ్వరం జలాలను వదిలేందుకు వెంటనే చర్యలు తీసుకుంటే రైతులు సంతోషిస్తారు.

-మద్ది రాజిరెడ్డి, రైతు, అహ్మదీపూర్, సిద్దిపేట జిల్లా

బోర్లు తక్కువగా పోస్తున్నయి

వర్షాలు సరైన సమయంలో కురవకపోవడంతో భూగర్భ జలమట్టం తగ్గడంతో బోర్లు తక్కువగా పోస్తున్నయి. బోర్లలో నీళ్లు రాకపోవడంతో రైతులు చాలా వరకు నాట్లు వేయలేకపోయారు. కొండపోచమ్మ కాలువ ద్వారా కూడవెళ్లిలోని కాళేశ్వరం జలాలను వదిలితే చెక్‌డ్యాంలో నీళ్లు పుష్కలంగా చేరి బోర్లకు ఉపయోగకరంగా ఉంటుంది. గత ప్రభుత్వం ఎప్పుడూ నీళ్లను కూడవెళ్లిలోకి వదలడంతో కూడవెళ్లి నిరంతరం కాలేశ్వరం జలాలతోనే కనిపించేది.

-కొత్తపల్లి రామగౌడ్, రైతు, అహ్మదీపూర్, సిద్దిపేట జిల్లా

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	30.6°c	24.3°c
రంగారెడ్డి	33.5°c	21.8°c
ఖమ్మం	33.0°c	25.0°c
నల్లగొండ	32.0°c	24.4°c
మెదక్	31.8°c	22.0°c
వరంగల్	31.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	26.0°c
హైదరాబాద్	30.2°c	24.0°c
మహబూబ్‌నగర్	29.2°c	23.2°c
నిజామాబాద్	27.5°c	21.1°c

వదలని వాన

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రాన్ని వానలు వదలడం లేదు. పది రోజులుగా కురుస్తూనే ఉన్నాయి. మరో రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళ, బుధవారం అక్కడక్కడ వర్షాలతో పాటు గాలులు వీస్తాయని పేర్కొన్నది. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా గార్లలో అత్యధికంగా 2.78 సెం.మీ., ఆసిఫాబాద్ జిల్లా టీ సిర్పూర్‌లో అత్యల్పంగా 1.78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.

2న ఉపాధ్యాయులతో సీఎం సమావేశం

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): ఇటీవల పదోన్నతి పొందిన 30 వేల మంది ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 2న సమావేశమవుతారని సీఎస్ శాంతికుమారి చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో నిర్వహించే సమావేశ ఏర్పాట్లపై ఆమె సోమవారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ జితేందర్, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వేలాదిగా తరలిరండి: పీఆర్టీయూటీఎస్

సమావేశానికి టీచర్లు ప్రతిఒక్కరూ హాజరు కావాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బేరెల్లి కమలాకర్‌రావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

'మాడల్ స్కూల్ టీచర్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి'

రాష్ట్రంలోని మాడల్ స్కూల్ టీచర్లకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాడల్ టీచర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు 010 పద్దు కింద జీతాలు అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శాసనమండలిలో పలుసార్లు ప్రస్తావించారు. జూనియర్ కాలేజీలలో పని చేస్తున్న పీజీటీలకు జేఎల్ స్కేళ్లు వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గిగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 29(నమస్తే తెలంగాణ): గిగ్ వర్కర్స్‌ను ఆదుకుంటామని హామీచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు పట్టించుకోకపోవడం బాధాకరమని తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ ఫౌండర్ షేక్ సలావుద్దీన్ ఆగ్ర హం వ్యక్తంచేశారు.సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 4.2లక్షల గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ ఉన్నారని, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, మెటర్నిటీ, పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు.

మోదీ, రేవంత్ ఫోన్ చేశాకే తెలిసింది!

- తెలంగాణ గవర్నర్‌గా నియమితులు కావడంపై జిష్ణు దేవ్ వర్మ ఆశ్చర్యం
- 31న ప్రమాణ స్వీకారం చేస్తానని వెల్లడి

అగర్తలా, జూలై 29: తెలంగాణ రాష్ట్ర కొత్త గవర్నర్‌గా నియమితులు కావడంపై త్రిపుర మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత జిష్ణు దేవ్ వర్మ స్పందించారు. అగర్తలాలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ గవర్నర్‌గా నియమించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసే వరకు తనకు అసలు ఆ విషయం గురించి తెలియదని పేర్కొన్నారు. ''శనివారం రాత్రి ప్రధాని మోదీ ఫోన్ చేసేంత వరకు తెలంగాణ కొత్త గవర్నర్‌గా నన్ను నియమించినట్టు నాకు తెలియదు. మీరు త్రిపుర బయట పనిచేయాల్సి ఉంటుందని ప్రధాని చెప్పారు. అందుకు తనకు ఇచ్చిన ఏ బాధ్యతనైనా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని సమాధానం ఇచ్చాను. ఆ తర్వాతనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నుంచి మరో కాల్ వచ్చింది. 'వెల్‌కమ్ టూ తెలంగాణ' అని ఆయన ఆహ్వానం పలికారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులైనట్టు అప్పుడే నాకు తెలిసింది.'' అని జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. ఈనెల 31న తాను తెలంగాణకు వెళ్తానని, అదే రోజున కొత్త గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తానని తెలిపారు. తాను ఇంతకు ముందు రాజకీయ పదవైన డిప్యూటీ సీఎంగా చేశానని, ఇప్పుడు రాజ్యాంగబద్ధ విధులు నిర్వహించబోతున్నానని అన్నారు. సీఎంతో సమన్వయంతో కలిసి పనిచేస్తానని ఆయన చెప్పారు.

త్రిపుర నుంచి నేనే తొలి గవర్నర్‌ని..

గవర్నర్‌గా తన నియామకం ప్రధాని మోదీకి త్రిపురపై శ్రద్ధకు నిదర్శనమని జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి గవర్నర్ అయిన తొలి వ్యక్తిని తానేనని సంతోషం వ్యక్తం చేశారు. తాను తెలంగాణకు గవర్నర్‌గా వెళ్తున్నప్పటికీ, త్రిపుర అభివృద్ధికి తన ఆలోచనలు, అభిప్రాయాలు పంచుకొనేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. త్రిపుర రాజ కుటుంబానికి చెందిన జిష్ణు దేవ్ వర్మ గత ఏడాది జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సెపాహిజాలా జిల్లా చరిలం స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన 1993లో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు.

ఇన్‌చార్జి గవర్నర్‌కు ఘన వీడ్కోలు

- సీపీ రాధాకృష్ణన్‌ను సన్మానించిన సీఎం రేవంత్
- రేపు కొత్త గవర్నర్‌గా జిష్టుదేవ్ వర్మ బాధ్యతలు..

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు రాజ్‌భవన్ సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేసి శాలువాతో సన్మానించారు. రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆయన త్వరలోనే అక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ కొత్త గవర్నర్‌గా నియమితులైన జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 31న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. త్రిపురకు చెందిన జిష్టుదేవ్ 1957 ఆగస్టు 15న జన్మించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైల్వేలో 7,951 పోస్టులు

(ఎడ్యుకేషన్ డెస్క్, హైదరాబాద్)

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రీజియన్లలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీర్, కెమికల్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ఆర్ఆర్‌బీ సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటీస్ (సీఈఎన్)–03/2024ను రైల్వే మంత్రిత్వశాఖ విడుదల చేసింది. మొత్తం 7951 ఖాళీలు ఉన్నాయి. సికింద్రాబాద్ రీజియన్‌లో 590 ఖాళీలు ఉన్నాయి. వీటిలో జూనియర్ ఇంజినీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్, కెమికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్ పోస్టులు ఉన్నాయి. సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీఈ/బీటెక్, బీఎస్సీ ఉత్తీర్ణులైనవారు ఈ పోస్టులకు అర్హులు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి చివరితేదీ ఆగస్టు 29. వివరాలకు https://rrbsecunderabad.gov.in చూడవచ్చు.

స్థానిక సమరానికి సన్నాహాలు

- ఓటర్ల జాబితా తయారీపై శిక్షణకు షెడ్యూల్
- ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు అధికారులకు శిక్షణ
- ఆగస్టు 2,3 తేదీల్లో జిల్లాలవారీగా తరగతులు
- కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

హైదరాబాద్, జూలై29 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. వార్డులవారీగా ఓటర్ల జాబితా తయారీ, పబ్లికేషన్, అభిప్రాయాల సేకరణకు సంబంధించి అధికారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక్కొక్క జిల్లా నుంచి ఐదుగురు అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తూ, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ మినహాయించి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్క జిల్లాల నుంచి ఐదుగురు డాటా ఎంట్రీ ఆపరేటర్లు లేదంటే అధికారులను ఒక రోజు శిక్షణకు పంపించాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అథారిటీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాల వారీగా శిక్షణకు సంబంధించిన షెడ్యూల్‌ను సైతం ప్రకటించింది.

2,3 తేదీల్లో అధికారులకు శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు సంబంధించిన అధికారులకు ఆగస్టు 2,3 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. 2న ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నది. 3న మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం పేర్కొన్నది.

సీఎం రేవంత్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న యాదాద్రి ప్రధానార్చకుడు నర్సింహాచార్యులు

సీఎంకు పండుగల జాబితా

హైదరాబాద్, జూలై 29(నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్వత్ సభ ఆధ్వర్యంలో పంచాంగకర్తలు, సిద్ధాంతులు విశ్వావసు నామ సంవత్సరం 2025–26 పండుగల జాబితాను సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి అసెంబ్లీలో, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు జూబ్లీహిల్స్ నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్వత్ సభ బాధ్యులను సీఎం, మంత్రి అభినందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, భద్రకాళి దేవాలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, యాదాద్రి దేవస్థానం చైర్మన్ నర్సింహమూర్తి, ప్రధానార్చకుడు నర్సింహాచార్యులు, తెలంగాణ విద్వత్ సభ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, కోశాధికారి ఎంవీఆర్‌శర్మ, వేదంపండితులు నటరాజశర్మ, సాయిదీక్షిత్ పాల్గొన్నారు.

రైల్వే లైన్‌పై సీఎంతో చర్చ

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): రైల్వేశాఖ చీఫ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యన్ సోమవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రైల్వేలైన్‌పై చర్చించారు. వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ రూట్ మ్యాప్‌ను వివరించారు. వికారాబాద్, పరిగి, కొడంగల్, నారాయణపేట్, మక్తల్ మీదుగా రూ.3,500 కోట్లతో 145 కిలోమీటర్ల మేర ఈ లైన్ ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. రైల్వే లైన్ రూట్‌మ్యాప్‌పై సీఎం పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వాకాటి శ్రీహరి, పర్ణికారెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ టెస్ట్ మస్ట్

- అట్లయితేనే బీసీలకు 'స్థానిక' రిజర్వేషన్లు
- అదీ 50 శాతం మించకూడదు
- బీసీ కమిషన్ నివేదికతోనే నిర్ధారణ
- 'సుప్రీం' మార్గదర్శకాలను పాటించకుంటే ఎస్సీ, ఎస్టీ మినహా అన్ని కోటాలు గల్లంతే
- పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉరుకులు
- రేవంత్ సర్కారు తీరుపై బీసీ నేతల్లో అనుమానాలు

హైదరాబాద్, జూలై 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సంబంధిత అధికారులను ఆదేశించడంతో బీసీ రిజర్వేషన్లపై అనుమానాలు అలుముకున్నాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలే ఇందుకు కారణమని స్పష్టమవుతున్నది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఏమో గానీ సర్వోన్నత న్యాయస్థానం సూచించిన ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించకుంటే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మినహా ఇప్పటికే అమలవుతున్న మిగతా అన్ని రిజర్వేషన్లూ ఊస్ట్ అయ్యే ప్రమాదం నెలకొన్నది. ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించని పలు రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికలను సుప్రీంకోర్టు ఇప్పటికే రద్దు చేయడాన్ని బట్టే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో ఇప్పటికీ ట్రిపుల్ టెస్ట్ ఆధారంగా రిజర్వేషన్ల స్థిరీకరణ జరగలేదు. అయినప్పటికీ త్వరలోనే స్థానిక ఎన్నికలను నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండటంతో బీసీ రిజర్వేషన్లపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. అసలు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలను ఎలా నిర్వహిస్తుందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలే నామమాత్రంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. గతంలో లాటరీ ద్వారా, ర్యాండమ్‌గా అశాస్త్రీయమైన పద్ధతుల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించడంతో న్యాయవివాదాలు తలెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కేశం కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసులో సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ పేరిట పలు మార్గదర్శకాలను జారీ చేసింది.

సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలు ఇవీ..

- ప్రతి స్థానిక సంస్థలో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన డెడికేటెడ్ బీసీ కమిషనే జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించాలి.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లన్నీ కలిపి మొత్తంగా 50% మించకూడదు.

డెడికేటెడ్ కమిషన్ సిఫారసులనేవి లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మినహా మరే రిజర్వేషన్లు ఉండబోవు. మిగతా స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే నిర్ధారిస్తారు. ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాలను పాటించని ఏ రాష్ట్రంలో కూడా స్థానికసంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఆ మార్గదర్శకాలను పాటించని పలు రాష్ట్రాల్లో స్థానికసంస్థల ఎన్నికలను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే మార్చే అవకాశమున్నది. సూటిగా చెప్పాలంటే కమిషన్ల నివేదిక

లేకుండా ఇకపై స్థానిక సంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు ఉండవు.

గుజరాత్ రాష్ట్రమే ఉదాహరణ

గుజరాత్‌లో 52% ఓబీసీ జనాభా ఉన్నప్పటికీ 1990 నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి కేవలం 10% సీట్లు మాత్రమే రిజర్వు చేస్తున్నారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ స్థానాలను మినహాయించి ఓబీసీలకు కేటాయిస్తూ వచ్చినప్పటికీ ఆ 10% సీట్లను కూడా జనరల్ స్థానాలుగానే పరిగణించాలని 2022 జూలై 2న ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఆ మేరకు గుజరాత్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలను జారీ చేసింది. దీంతో మొత్తంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీల రిజర్వేషన్లు ప్రశ్నార్థకంగా మారిపోయాయి. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయంపై విపక్షంతోపాటు స్వపక్షం నుంచి కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గుజరాత్ ప్రభుత్వం దిగొచ్చింది. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ కోసం ఎట్టకేలకు జస్టిస్ కేఎస్ ఝవేరి నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఓబీసీ రిజర్వేషన్ల స్థిరీకరిస్తూ 2023 ఏప్రిల్‌లో గుజరాత్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఆ నివేదికపై అదే ఏడాది ఆగస్టులో గుజరాత్ మంత్రి మండలి చర్చించి, ఓబీసీలకు 27% రిజర్వేషన్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు విధించిన 50% సీలింగ్‌ను దాటకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు 14%, ఎస్టీలకు 7%, ఓబీసీలకు 27% చొప్పున మొత్తంగా 48% రిజర్వేషన్లను ఖరారు చేశారు. గుజరాత్‌లో పంచాయతీ ఎన్నికలను 2026లో నిర్వహించాల్సి ఉన్నది.

ప్రభుత్వ హడావుడిలో ఆంతర్యమేంటి?

గుజరాత్‌తోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలన్నీ డెడికేటెడ్ కమిషన్ ద్వారా రిజర్వేషన్లను స్థిరీకరించిన తర్వాతే ఎన్నికలకు నిర్వహించేందుకు సిద్ధమైన ఉదంతాలు కండ్ల ముందే ఉన్నాయి. ఆయా అంశాలను డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నేతృత్వంలోని రాష్ట్ర బీసీ కమిషన్ సైతం ప్రభుత్వానికి చెప్తూనే ఉన్నది. కానీ, వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తాం అని రేవంత్‌రెడ్డి సర్కారు హడావుడి చేస్తుండటం వెనుక ఆంతర్యమేమితో తెలియడం లేదని బీసీ సంఘాలు మొత్తుకుంటున్నాయి. మొత్తంగా బీసీ రిజర్వేషన్లను ఎత్తేసి ఎన్నికలను నిర్వహిస్తారా? అని అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి.

స్పష్టతనివ్వని కాంగ్రెస్ సర్కార్

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బ